

ఆయన రాక.. అందుకేనా?

- పాఠశాలల పరిశీలనకా.. అధికార పార్టీ ప్రచారానికా?
- పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జిల్లా పర్యటనపై అనేక సందేహాలు
- వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా ప్రవీణ్ ప్రకాష్ వ్యాఖ్యలు
- విద్యార్థుల ఎదురుగా ఉపాధ్యాయులు, అధికారులపై ఆగ్రహం
- ఎన్నికల వేళ.. ఇదేమిటని ఉపాధ్యాయ సంఘాల మండిపాటు



పార్వతీపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉమ్మడి జిల్లా పర్యటనపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలల పరిశీలనకు వచ్చారా? లేక ప్రభుత్వం తరపున ప్రచారానికి వచ్చారా? అనేది చర్చనీయాంశమవుతోంది. పాఠశాలల తనిఖీలు అంటూ ఆయన అధికార పార్టీకి అనుకూలంగా వ్యాఖ్యలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు కూడా మండిపడుతున్నారు.

ఇదేం తీరు..

పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ శనివారం మన్యం జిల్లాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ప్రధానంగా గుమ్మలక్ష్మీపురంలో జడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, ఎస్‌కేపాడు, ఓండ్రుజోల, ఓండ్రు బంగి ప్రాథమిక పాఠశాలలు, కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. కాగా గుమలక్ష్మీపురంలో జడ్పీ పాఠశాలలో డిజిటల్ విద్య బోధనపై ఆయన మండిపడ్డారు. ఉన్నతస్థాయి అధికారులకు అవగాహన లేకపోతే విద్యార్థులకు ఏ విధంగా పాఠ్యాంశాలను బోధించగలరని ప్రశ్నించారు. డిజిటల్ విద్యకు ప్రభుత్వం కోట్లాది రుపాయలు వెచ్చిస్తుందని.. గతంలో ఏ ప్రభుత్వమైనా ఇంత ఖర్చుపెట్టిందా? అని ఆయన వ్యాఖ్యానించడం ఇప్పుడు వివాదాస్పదమవుతోంది. ఇది ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘించినట్టు కాదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పుడు ప్రభుత్వం తరపున మాట్లాడిన ఆయన తీరుపై ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు ధ్వజ మెత్తుతున్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని వెనుకేసుకుని రావడమే కాకుండా విద్యార్థుల ముందే గురువులపై ఆగ్రహం వ్యక్తం చేయడం ఎంతవరకు సమంజసమని సంఘాలు నాయకులు ప్రశ్నిస్తున్నారు. అధికారం ఉంది కదా అని.. వైసీపీ నాయకులు మాదిరిగానే ఆయన కూడా ఇష్టారాజ్యంగా ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులను మాట్లాడడం దారుణమని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

కోడ్ అమలులో ఉండగా..

ప్రస్తుతం ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేసే పనిలో ఉన్నతాధికారులతో పాటు ఉపాధ్యాయులు కూడా నిమగ్న మై ఉన్నారు. ఇటువంటి సమయంలో పాఠశాలల తనిఖీల పేరిట ప్రవీణ్ ప్రకాష్ జిల్లాకు వచ్చి ఉపాధ్యాయులతో పాటు ఉన్నత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది తనిఖీల సమయంలో జరిగిన సంఘటనను కూడా పదే పదే ప్రవీణ్ ప్రకాష్ గుర్తు చేయడంపై క్షేత్రస్థాయిలో సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులతో పాటు జిల్లా అధికారి యంత్రాంగంపై ఆయన ఎటువంటి ఉద్దేశం ఉందో స్పష్టంగా కనిపిస్తుందని వాపోతున్నారు. గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రంలోనే పార్వతీపురం ఐటీడీఏకు ఉన్నత స్థానం లభించింది. అదేవిధంగా జిల్లాకు కూడా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం లభించింది. ఇటువంటివన్నీ ప్రవీణ్ ప్రకాష్ దృష్టిలో పెట్టుకోకుండా తన పర్యటనలో ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాఠశాలల గ్రాంట్ పరిస్థితి ఏమిటి?

ఉమ్మడి జిల్లాలో ఉన్న పాఠశాలలకు రెండేళ్లుగా ప్రత్యేక గ్రాంట్ మంజూరు కావడం లేదు. దీంతో ఉపాధ్యాయులు తమ జేబులో నుంచి సొమ్మును తీసి ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక గిరిజన ఆశ్రమ పాఠశాలలకు సుమారు ఆరు నెలలుగా డైట్‌బిల్లులు అందడం లేదు. ఇటువంటి వాటిపై ప్రవీణ్ ప్రకాష్ లాంటి ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా మాట్లాడడం తగదు..

పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ జిల్లా పర్యటనలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులపై ఇష్టారాజ్యంగా మాట్లాడడం తగదు. వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడం దారుణం. దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. పర్యటనలో భాగంగా వైసీపీ ప్రభుత్వం డిజిటల్ విద్యకు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నట్టు ఆయన ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం. విద్యాబోధనలపై ఉపాధ్యాయులకు పూర్తి స్థాయిలో శిక్షణ అందించకుండా వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడం భావ్యం కాదు. రెండేళ్లుగా స్కూల్స్ గ్రాంట్స్ విడుదల చేయడం లేదు. ఉపాధ్యాయులు సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. ఇవేవీ పట్టించుకోకుండా ఉపాధ్యాయులు తప్పులను ఎంచేందుకే ప్రవీణ్ ప్రకాష్ ప్రత్యేకంగా వచ్చినట్టు కనిపిస్తోంది. ఎన్నికల సమయంలో ఇటువంటి పర్యటనలు ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదు. దీనిపై ఎన్నికల సంఘం స్పందించాలి.

- ఎస్.మురళీమోహన్‌రావు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు, పార్వతీపురం



గుమలక్ష్మీపురంలో జడ్పీ పాఠశాలలో డిజిటల్ బోధనను పరిశీలిస్తున్న ప్రవీణ్ ప్రకాష్ (ఫైల్)

సచివాలయాల వద్దే..

- 3 నుంచి పింఛన్ల పంపిణీ
- మార్గదర్శకాలు విడుదల

పార్వతీపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి)/సాలూరు రూరల్: జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ నెల 3 నుంచి సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు ఆదివారం గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ఆదేశాలు జారీ చేసింది. కొంతమంది వలంటీర్ల పనితీరుపై కొందరు కోర్టుకు వెళ్లారు. దీంతో న్యాయస్థానం ఆదేశాల మేరకు సామాజిక పింఛన్ల పంపిణీ వలంటీర్ల ద్వారా చేపట్టరాదని ఎన్నికల సంఘం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో పింఛన్లు పంపిణీకి సెర్ప్ కార్యాచరణ చేసింది. పింఛన్‌దారులు ఆధార్, రేషన్‌కార్డుతో సచివాలయానికి వెళ్తే.. పింఛను సొమ్మును సచివాలయ సిబ్బంది అందించనున్నారు. ఏప్రిల్ ఒకటిన బ్యాంకులు తెరిచినా.. ఆర్థిక సంవత్సరం ప్రారంభం రోజు కావడంతో ఖాతాదారులకు సేవలుండవు. దీంతో 2న డబ్బులు డ్రా చేసి వార్డు, గ్రామ సచివాలయ కార్యదర్శులు,సిబ్బందికి అందించనున్నారు. 3న సచివాలయాలు వద్ద పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పింఛన్లు ఇదే విధంగా పంపిణీ చేయనున్నారు. కాగా జిల్లాలో అన్ని రకాల సామాజిక పింఛన్లు 1,41,000 వరకు ఉన్నాయి. దీనిపై ఇన్‌చార్జి డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడును వివరణ కోరగా.. సచివాలయాల వద్దే సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నామని, సెర్ప్ నుంచి మార్గదర్శకాలొచ్చాయని తెలిపారు. ఈనెల 3 నుంచి 8 వరకు పంపిణీ జరుగుతుందని, సమస్యలొస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. మార్పులు చేపడతామని వెల్లడించారు.

వివరాలు సేకరించాలని..

మొత్తమ్మీద తాయిలాల జోరును వైసీపీ నాయకులు మున్ముందు మరింతగా పెంచే సూచనలు కనిపిస్తున్నాయి. రకరకాల గిఫ్టులు కూడా ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు. మరోవైపు వైసీపీ నేతలు అన్ని చోట్లా మాదిరిగానే ఇక్కడ కూడా వలంటీర్లను వారి పరిధిలోని 50 కుటుంబాల వివరాలు, వారి బలహీనతలు సేకరించి తమకు చెప్పాలని కోరుతున్నారు.

టీడీపీపై విష ప్రచారం

- సోషల్ మీడియా వేదికగా వలంటీర్లకు వైసీపీ నాయకుల మెసేజ్‌లు

పార్వతీపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కొంతమంది వలంటీర్లను అధికార పార్టీ తన సొంత కార్యకర్తలకంటే ఎక్కువగా వాడుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికార వైసీపీ మరో విష ప్రచారానికి తెరలేపింది. వారిని పింఛన్ల పంపిణీ నుంచి దూరం పెట్టాలని, ప్రత్యామ్నాయ మార్గాల్లో అందించాలని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అయితే టీడీపీ ఫిర్యాదు వల్లే 'పింఛను అందడం లేదు' అన్నట్లుగా ఇంటింటికీ వెళ్లి చెప్పాలని కొందరు వలంటీర్లను వైసీపీ సామాజిక మాధ్యమాల ద్వారా ఆదేశించింది. వాస్తవానికి వలంటీర్లు వైసీపీ అనుకూల ప్రచారం చేయడాన్ని మాత్రమే టీడీపీ వ్యతిరేకించింది. పింఛన్ పంపిణీకి సంబంధించి ఈసీకి ఎలాంటి ఫిర్యాదులూ చేయలేదు. అయినా సరే.. టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదు వల్లే వలంటీర్లతో ఇంటింటికీ పెన్షన్ పంపిణీని ఈసీ నిలిపేసిందనే ప్రచారానికి వైసీపీ నేతలు పూనుకున్నారు. కోర్టు ఉత్తర్వులు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రోద్బలంతోనే విడుదలైనట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రతినెలా ఒకటోతేదీన అవ్వ తాతలకు అందాల్సిన పెన్షన్‌ను అందనీయకుండా టీడీపీ అడ్డుకుంటోందని, ఈ విషయాన్ని గడపగడపకూ ప్రచారం చేయాలని వలంటీర్లకు సూచిస్తూ సోషల్ మీడియాలో మెసేజ్‌లు పోస్ట్ చేసి వైరల్ చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. మొత్తంగా వలంటీర్లు లేకపోతే పింఛన్ల పంపిణీ సక్రమంగా జరగదనేలా దుష్ప్రచారం చేస్తున్నారు. కాగా హై కోర్టు ఆదేశాలను సైతం వైసీపీ రాజకీయం చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వలంటీర్లకు ఎర!

- కొనసాగుతున్న తాయిలాల పంపిణీ
- సచివాలయం కన్వీనర్లకు రూ.10 వేలు..
- కొన్ని ప్రాంతాల్లో ఎన్నికల షెడ్యూల్‌కు ముందే అందజేత
- గుట్టుగా చేపడుతున్న వైసీపీ నాయకులు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)/ మెంటాడ

వలంటీర్లను వైసీపీ చేతిలో పెట్టుకుంది. వారి చేత ఎన్నికల వ్యవహారాలను గుట్టుగా నడుపుతోంది. వారినే ఆయుధాలుగా ఎన్నికల్లో ఉపయోగించుకోవాలని భావిస్తోంది. ఇప్పటికే వారి ద్వారా అధికార పార్టీ నాయకులు తమకు అవసరమైన సమాచారాన్ని రాబెట్టారు. అందుకనుగుణంగా వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే జీతాన్ని నెలకు రూ.10వేలు చేస్తామన్న ప్రచారమూ సాగిస్తున్నారు. ఎన్నికల ముందు వారికి తాయిలాలు ఇచ్చారు. షెడ్యూల్‌కు ముందు ఈ వ్యవహారం మొదలైంది. ఇంకా కొనసాగుతోంది. అనేక నియోజకవర్గాల్లో డబ్బులుతో పాటు దుస్తులు అందించినట్లు తెలిసింది.

సాలూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లకు తాయిలాల పంపిణీకి రంగం సిద్ధమైంది. పాచిపెంట, సాలూరు పట్టణంలో మాత్రం పంపిణీ పూర్తయినట్లు సమాచారం. మిగతా మండలాల్లో వలంటీర్లకు రూ.5 వేలు, సచివాలయం కన్వీనర్లకు రూ.10 వేలు వంతున నిధులు మండల నాయకులకు చేరాయి. అయితే వీటిని పంపిణీ చేసేందుకు నేతలు కాస్త జంకుతున్నారు. వలంటీర్లలో టీడీపీ సానుభూతిపరులు కూడా ఉండడమే దీనికి కారణం. వారిని మినహాయించి మిగతావారికి ఇస్తే ఎటువంటి ఇబ్బందులు వస్తాయోనని తర్జనభర్జన పడుతున్నారు. అందరినీ సమావేశపరిచి ఒకేసారి పంపిణీ చేస్తే టీడీపీ సానుభూతి పరులు తమ పార్టీవారికి ఉప్పందిస్తే రచ్చ అవుతుందని భయపడుతున్నారు. కొందరు వలంటీర్లు విధులకు స్వస్తి చెప్పగా, కొందరు వివాహాలు చేసుకొని వెళ్లిపోయారు. ఆ క్రమంలో అందరినీ ఎలా కలుపుకొని వెళ్లాలో.. ఏంచేయాలో వైసీపీ నేతలకు పాలుపోక సతమతమవుతున్నారు. ఇదిలావుండగా గ్రామాలకు చేర్చిన నిధులు ఎక్కడ దారి మళ్లుతాయోనని మండల నాయకులు ఆందోళన చెందుతున్నారు. త్వరగా తాయిలాలు పంపిణీ పూర్తి చేయాలని సూచిస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో పంపిణీకి రంగం సిద్ధమైనట్టు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ముందు పంపిణీ చేస్తామని చెబుతున్నట్లు సమాచారం. దీనిపై టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఓ కన్నేసి ఉంచాయి. సుమారు రూ.కోటి రూపాయలు చేతులు మారే అవకాశం ఉండడంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టించేందుకు నిఘా పెట్టారు. దీంతో కొందరు వలంటీర్లు, కన్వీనర్లు దీనికి దూరంగా ఉండాలని భావిస్తున్నారు. పట్టుబడితే ప్రజల్లో పరువు పోవడంతో పాటు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని భయపడుతున్నారు. ఇదిలా ఉంటే కొన్ని గ్రామాల్లోని నాయకులు ఈ తాయిలాల సొమ్మును తాత్కాలికంగా తమ అవసరాలకు వాడుకుంటున్నారని చెబుతున్నారు.

టిడ్కో ఇళ్లు ఇచ్చేదెప్పుడో?

- జిల్లా కేంద్ర పేదలకు పంపిణీ చేయని వైనం
- 2022లో పూర్తి కావాల్సిన నిర్మాణాలు
- నేటికీ కొనసా..గుతున్న పనులు
- నిరాశలో లబ్ధిదారులు

పార్వతీపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం పార్వతీపురంలో లబ్ధిదారులకు ఇంకా టిడ్కో ఇళ్లు అందలేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండగా.. ఇళ్లు ఎప్పటికి అందిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవంగా 2022లోనే వాటి నిర్మాణాలు పూర్తవ్వాల్సి ఉండగా.. నేటికీ ఆ పనులు పూర్తవ్వకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా రూ.500 చెల్లించిన లబ్ధిదారుల గృహ నిర్మాణాలు ఇంకా కొలిక్కి రాలేదు. ఇక టిడ్కో ఇళ్ల కోసం అప్పులు చేసి మరీ రూ. 25 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇంతవరకు ఆ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించలేదు. కనీసం వారు కట్టిన డబ్బులు కూడా తిగిరి చెల్లించలేదు. ఏళ్లు గడుస్తున్నా.. అతీగతీ లేకపోవడంతో ఆయా లబ్ధిదారులు మరింత ఆందోళన చెందుతున్నారు. రూ.500 చెల్లించిన లబ్ధిదారుల గృహనిర్మాణాలు పూర్తవుతుండగా.. తమ పరిస్థితేమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వం హయాంలో టిడ్కో గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. జిల్లా కేంద్రానికి అతి సమీపంలోని పార్వతీపురం మండలం అడ్డాపుశీల గ్రామం వద్ద పనులు ప్రారంభించారు. ఈ మేరకు పట్టణ పేదలకు ఏ కేటగిరీలో 300 ఎస్ఎఫ్‌టీ, బీ కేటగిరీలో 365 ఎస్ఎఫ్‌టీ, సీ కేటగిరీలో 430 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో 1500 ఇళ్లు నిర్మించాలని భావించారు. దీనికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కూడా అప్పట్లో పూర్తి చేశారు. ఏ-కేటగిరీలో 264 మంది లబ్ధిదారులు రూ.500 చొప్పున, బీ- కేటగిరీలో 240 మంది రూ.25 వేల చొప్పున, సీ- కేటగిరీలో 384 మంది రూ. 50 వేల చొప్పున డీడీలు రూపంలో మున్సిపల్ కమిషనర్‌కు అందించారు. దీంతో ఇళ్ల నిర్మాణాలకు అడుగులు పడగా.. ఆ తర్వాత ఎన్నికలు రావడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో సీన్ మారింది. 430, 365, 300 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో ఇళ్ల కోసం ఎంపిక చేసిన లబ్ధిదారుల నెత్తిన పిడుగు పడినట్టయ్యింది. ఇళ్లు నిర్మించి అందిస్తామన్న వైసీపీ పాలకులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. వైసీపీ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత 2020లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. 2022 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాల్సి ఉంది. కానీ నేటికీ వాటి పనులు పూర్తికాని పరిస్థితి నెలకొంది. కేవలం సింగిల్ బెడ్ రూమ్‌కు సంబంధించి 768 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే చేపట్టగా.. డబుల్ బెడ్ రూమ్ గృహ నిర్మాణాలకు పూర్తిగా మంగళం పాడేశారు. కాగా రూ.500 చెల్లించిన వారికి సాలూరులో ఇళ్లు అందించగా.. జిల్లాకేంద్రం పార్వతీపురంలో ఎందుకు పంపిణీ చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా నేటికీ టిడ్కో గృహ నిర్మాణ పనులు తుది దశకు చేరుకోకపోవడంతో లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు.

ఆ డీడీలు ఎక్కడ?

365 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో డబుల్ బెడ్ రూమ్ ఇంటి కోసం సుమారు 384 మంది రూ. 25 వేల చొప్పున రెండు పర్యాయాలు డీడీలు తీసి మున్సిపల్ అధికారులకు అందించారు. కానీ ఐదేళ్లు గడుస్తున్నా.. నేటికీ ఆ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించ లేదు. ఆ లబ్ధిదారులు కట్టిన సొమ్మును తిరిగి చెల్లించలేదు. దీంతో వారంతా లబోదిబోమంటున్నారు. ఈ నిధులను వైసీపీ సర్కారు వేరే అవసరాలకు మళ్లించిందనే ఆరోపణలు లేకపోలేదు. కాగా సొంతింటి కల నెరవేరుతుందనే ఆశతో అప్పులు చేసి మరీ డబ్బులు చెల్లించిన లబ్ధిదారులు సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఆ పనులేవీ చేపట్టనందున తాము కట్టిన డబ్బులు వాపసు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇకపోతే రూ.500 చెల్లించిన వారికి కూడా ఇళ్లు పంపిణీ చేయలేదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లాకేంద్ర లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

నిర్మాణాలు పూర్తవుతున్నాయి..

టిడ్కో ఇళ్లు సిద్ధమవుతున్నాయి. వాటి నిర్మాణాలు పూర్తవుతున్నాయి. ప్రస్తుతం రహదారులతో పాటు వాటర్ ట్యాంక్ పనులు చేపడుతున్నాం. ఎన్నికల అనంతరం ఇళ్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుంది.

- ప్రవీణ్‌కుమార్, ఏఈ

ఆ ఖాతాలో జమ

టిడ్కో ఇళ్ల కోసం గతంలో లబ్ధిదారులు డీడీల రూపంలో చెల్లించిన మొత్తాన్ని టిడ్కో ఎండీ ఖాతాలో జమ చేశాం. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టిలో కూడా పెట్టాం.

- శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, పార్వతీపురం

న్యాయం చేయాలి..

సొంత ఇంటిలో ఉండాలనే ఆశ కలగానే మిగిలిపోయింది. నాలుగేళ్ల కిందట టిడ్కో ఇంటి కోసం రూ. 50 వేలకు డీడీ తీసి సంబంధిత అధికారులకు అందించాం. అయితే ఇప్పటివరకు ఆ ఇళ్ల నిర్మాణాలే ప్రారంభం కాలేదు. నా డబ్బులు చేతికి వస్తాయో లేదోనన్న భయం వెంటాడుతుంది. అధికారులు స్పందించి వా లాంటి వారికి న్యాయం చేయాలి.

- ఎం. సోమేశ్వరరావు, పార్వతీపురం టౌన్

పట్టించుకునే వారే లేరు

టిడ్కో ఇంటి కోసం రూ. 50 వేలు అప్పు చేసి చెల్లించాను. అయితే ఇంతవరకు నాకు ఇల్లు మంజూరు చేయలేదు సరికదా నేను కట్టిన సొమ్ము తిరిగి ఇవ్వాలని కోరుతున్నా.. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. రూ.500లు చెల్లించిన వారి ఇళ్ల నిర్మాణం జరిగిపోయింది. మా ఇళ్ల నిర్మాణం మాత్రం ప్రారంభం కాలేదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలి.

- సత్యనారాయణ, పార్వతీపురం టౌన్



టిడ్కో ఇళ్ల నిర్మాణాలు ఇలా..



వెలగవాడలో ఎమ్మెల్యే కళావతిని నిలదీస్తున్న మహిళలు

ఎలా ఓట్లు అడుగుతారు?

- పాలకొండ ఎమ్మెల్యేకు నిరసన సెగ
- పలు సమస్యలపై నిలదీసిన గ్రామస్థులు

పాలకొండ: పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి ప్రజల నుంచి నిరసన సెగ తగిలింది. వివిధ సమస్యలపై పలు గ్రామాల ప్రజలు ఆమెను నిలదీశారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపకుండా ఎలా ఓట్లు అడగడానికి వస్తారని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఆదివారం ఆమె పాలకొండ మండలం వెలగవాడలో ఇంటింటా ప్రచారం చేశారు. ఇదే సమయంలో ఆ గ్రామానికి చెందిన మహిళలు గుంపుగా చేరుకుని ఇళ్ల స్థలాల సమస్యలపై ప్రస్తావించారు. తమ గ్రామ పరిధిలో కాకుండా అటవీ ప్రాంతంలో కొండ పక్కన ఇళ్ల స్థలాలు కేటాయించడంపై మండిపడ్డారు. తమ ఓటు హక్కు వెలగవాడలో ఉందని, ఇళ్ల స్థలాల ఇచ్చే ప్రాంతంలో లేదని తెలిపారు. అటువంటప్పుడు ఆయా గ్రామాలకు వెళ్లి ఇళ్ల స్థలాలు ఎలా నిర్మించగలమని ప్రశ్నించారు. కొంతమందికి స్థానికంగానే స్థలాలు కేటాయించారని, ఈ విషయంలో రాజకీయాలు చేశారన్నారు. ఇళ్ల స్థలాలు మంజూరుకు దరఖాస్తు చేసుకుంటే స్థానిక నాయకులు అడ్డుకున్నారమని మరికొందరు తెలిపారు. సంక్షేమ పథకాల మంజూరు లోనూ మొండిచేయి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఎక్కడో ఒక దగ్గర ఇంటి స్థలం ఇచ్చారు కదా' అని ఎమ్మెల్యే కళావతి అనడంతో స్థానికులు ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆమె వెంట వచ్చిన వైసీపీ నాయకులు ఆ ప్రాంతవాసులను సముదాయించారు. అనంతరం ఆమె సింగన్నవలస గ్రామానికి వెళ్లగా.. వలంటీర్ పోస్టు కోసం స్థానిక నాయకులు కొంత మొత్తాన్ని వసూలు చేశారని ఆరోపించారు. ఆ తర్వాత అంపిలి గ్రామానికి ఎమ్మెల్యే కళావతి వెళ్లగా అక్కడ కూడా ఆమెకు నిరసన సెగ తప్పలేదు. గ్రామంలో రహదారులను తవ్వేసి, పైపు లైన్లువేసి ఏడాదిన్నర గడుస్తున్నా ఎందుకు తాగునీరు సరఫరా చేయడం లేదని ప్రశ్నించారు. ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారా? అని ఎమ్మెల్యేను నిలదీశారు.

కుక్క స్వైరవిహారం

- 20 మందికి గాయాలు



చికిత్స పొందుతున్న బాధితుడు

కొమరాడ, మార్చి31: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎదురుగా ఉన్న కాలనీలో ఓ కుక్క స్వైరవిహారం చేసింది. ఆదివారం ఉదయం కాలనీలో జనంపైకి ఎగబడింది. 20 మందికి పైగా కాటు వేసి... సమీపం తోటలోకి వెళ్లిపోయింది. కాగా ప్రజలు భయంతో పరుగులు తీశారు. బాధితులు కరుణాసాగర్, లక్ష్మణరావు, గోపాలం, నారాయణమ్మ, రమణమ్మ, సోమేశ్వరరావు, సతీష్‌కుమార్, రోజా, అప్పలనాయుడు, గణేష్, తవిటయ్యతో పాటు పలువురు కొమరాడ పీహెచ్‌సీ లో చికిత్స పొందారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో కుక్కలు లేకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అత్యంత ప్రమాదకరంగా ఉన్న పూల్‌బాగ్ ప్రధాన రహదారి

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

● బొబ్బిలి పట్టణంలో అధ్వానంగా రోడ్లు ● పట్టించుకోని అధికారులు, నాయకులు

(బొబ్బిలి)

బొబ్బిలి పట్టణ పరిధిలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి చాలా అధ్వానంగా ప్రమాదకరంగా తయారైంది. రైల్వే గూడ్స్ రవాణా కోసం భారీ వాహనాలు ప్రతి రోజూ ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తుండడంతో ఈ రోడ్డు పూర్తిగా నాశనమైంది. రహదారి సామర్థ్యానికి మించిన భారీ బరువులతో వాహనాలు వెళ్తుండడంతో ఈ రోడ్డు పూర్తిగా కుంగిపోయి, పెద్ద గుంతలుగా ఏర్పడింది. దీనితో రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగించే వాహనదారులు, ఆటోలు, రిక్షాలు, బాటసారులు, ద్విచక్రవాహనదారులంతా నరకయాతనకు గురవుతున్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్న ప్రమాదాల బారిన పడడం ఖాయం. రాత్రివేళల్లో రైళ్ల కోసం రాకపోకలు సాగించే వారి పరిస్థితి మరీ దయనీయంగా ఉంటోంది. ఈ రోడ్డు పాడైపోవడమే కాక, ఈ లైనులో ఉండే మున్సిపల్ తాగు నీటి పైపులైనుకు తరచూ మరమ్మతులు ఏర్పడుతున్నాయి. పెద్దఎత్తున తాగునీరు వృధాగా పోతోంది. రైల్వేశాఖ వారు ఎక్కువగా వినియోగిస్తు న్నందున వారే ఈ రోడ్డు నిర్వహణ, మరమ్మతు చేయాలని మున్సిపాలిటీ వాదిస్తోంది. గతంలో దీనిపై పెద్ద వివాదమే సాగింది. అయినప్పటికీ పరి స్థితిలో ఎటువంటి మార్పులేకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చే స్తున్నారు. ఇకనైనా ఈరోడ్డుకు మోక్షం కలిగించాలని డిమాండ్ చేస్తున్నారు.

పూల్‌బాగ్‌లో అత్యంత ప్రమాదకరంగా..

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రాజా కళాశాల మీదుగా పూల్‌బాగ్, బైపాస్ రోడ్డు జంక్షన్‌కు వెళ్లే తెర్లాం రహదారిలో పశువైద్యశాఖ కార్యాలయం దగ్గర ప్రధాన రహదారి అత్యంత ప్రమాదకరంగా తయారైంది. దీని గురించి పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. బొబ్బిలి-తెర్లాం, రాజాం, శ్రీకాకుళం, బొబ్బిలి-బాడంగి, బొబ్బిలి-బలిజిపేట ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారిలో నడిమధ్యన పెద్ద గుంత ఏర్పడింది. ద్విచక్రవాహనదారులు, ఆటోలు, కార్లు వంటివి ఏమాత్రం ఆదమరిచినా ఇక్కడ పెనుప్రమాదం జరగడం ఖాయం. ఏదైనా అపాయం జరిగితే గానీ అధికారులు పట్టించుకోరా? అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీతో ఉండే ఈ రహదారిని బాగుచేయకుండా ఇంత నిర్లక్ష్యం చూపడం పట్ల స్థానికుల నుంచి తీవ్ర ఆక్షేపణ వ్యక్తమవుతోంది. మున్సిపాలిటీ నిధుల నుంచి ఈ రోడ్డును బాగుచేసినప్పటికీ అది మూన్నాళ్లముచ్చటగానే మిగిలిపోయింది. ఈ గుంత ఏర్పడిన ప్రాంతంలో మార్కెట్ కూడలితో పాటు అనేక కళాశాలలు, పాఠశాలలు ఉండడం గమనార్హం.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

● తూర్పుగోదావరి జిల్లావాసి మృతి

గజపతినగరం: మదుపాడ గ్రామంలో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట మండలం, రామవరం గ్రామానికి చెందిన గుర్రే లోవరాజు(50) ఇటీవల మదుపాడ గ్రామానికి సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీలో కూలి పని కోసం వచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున బహిర్భూమికి జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో గజపతినగరం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు గజపతినగరం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయంపై ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు.

మద్యం సీసాలతో పట్టుబడ్డ మహిళ

బొబ్బిలి: మండలంలోని కారాడ గ్రామానికి చెంది చింతాడ అప్పమ్మ 30 మద్యం బాటిళ్లతో ఆదివారం పట్టుబడినట్లు ఎస్ఈబీ సీఐ బీవీ మురళీధర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఆమె ఇంట్లో తనిఖీలు నిర్వహించగా మద్యసీసాలతో ఆమె పట్టుబడిందన్నారు. ఆమెను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు ఎస్వీ రామారావు, ఎల్.తిరుపతిరావు, హెచ్‌సీ బి.మాధవీదేవి, ఈసీలు బి.ఆదినారాయణ, వై.సరస్వతి పాల్గొనట్లు సీఐ తెలిపారు.

రేగిడి: మండలంలోని కొమిరి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆది వారం మజ్జిరాముని పేట జంక్షన్‌లో 29 మద్యంసీసాలతో పట్టుబడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

జూదరుల అరెస్టు

బొండపల్లి: దేవుపల్లి గ్రామ శివారులో జూదం ఆడుతున్న 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.లక్ష్మణరావు ఆదివారం సాయంత్రం తెలిపారు. గ్రామం శివారులోని మామిడితోటలో జూదం ఆడుతున్న 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.41వేల నగదుతోపాటు 10 మొబైల్స్, 4 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

విజయనగరం క్రైం: జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రజలు రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ వెంకటరావు హెచ్చరించారు. ఆదివారం సమస్యాత్మక ప్రాంతాలైన దుప్పాడ, జొన్నగుడ్డ కేఎల్‌పురం ప్రాంతాల్లో పర్యటించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే పాత నేరస్థులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎవరైనా వివాదాలు సృష్టిస్తే, చర్యలు తప్పవన్నారు.

నేడు ఎల్.కోట మండలంలో ప్రచారం

లక్కవరపుకోట: శృంగవరపుకోట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి సోమవారం లక్కవరపుకోట మండలంలో ప్రచార యాత్ర చేస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు తెలిపారు. ఉదయం వీరభద్రపేట, సాయంత్రం తలారి, ఖాసాపేట గ్రామాల్లో ఇంటింట ప్రచారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ-జనసేన-బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

నేడు టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

జామి: మండలంలోని భీమసింగి ముత్యాలమ్మ కల్యాణమండపంలో టీడీపీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండలపార్టీ అధ్యక్షుడు స్వామినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంకు ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనువాస్,జనసేన నాయకుడు మర్రాపు సురేష్ తదితరలు హాజరవుతారని తెలిపారు.

ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని ఏడో వార్డులో కౌన్సిలరు దిబ్బ సునీతాగోపి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు పాల్గొన్నారు. ఎన్నికల్లో అన్ని వర్గాల వారి మద్దతును కూడగట్టుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై వార్డు పెద్దలతో ఎమ్మెల్యే చర్చించారు. మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు, చోడిగంజి రమేష్‌నాయుడు, రేజేటి విస్సు, దిబ్బ రమణ(పంటలి) తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను 63.6 శాతం వసూలు

బొబ్బిలి, మార్చి 31: ఆర్థిక సంవత్సరాంతానికి బొబ్బిలి మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూలు 63.6 వాతానికి చేరినట్లు మున్సిపల్ కమిషనరు లాలం రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ అసెస్‌మెంట్లు మొత్తం 13,125 అని వాటి నుంచి 6.40 కోట్ల రూపా యల ఆస్తిపన్ను వసూలు కావాల్సి ఉండగా 4.07 కోట్ల రూపాయలు వసూలైనట్లు ఆమె తెలిపారు. ఆన్‌లైన్‌లో ఇంకా చెల్లింపులు జరిపితే ఈ వసూళ్ల మొత్తం ఇంకా పెరుగుతుందన్నారు.

సేవాదళ్ రాజాం జోనల్ కోఆర్డినేటర్‌గా రామకృష్ణ

రేగిడి: మండలంలోని ఉప్పరనాయుడువలసకు చెందిన కరణం రామకృష్ణ సత్యసాయి సేవదళ్ కమిటీ రాజాం జోనల్ కోఆర్డి నేటర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా సేవాదళ్ కమిటీ అధ్యక్షుడు సునీల్‌కుమార్ రాథోడ్ చేతులమీదగా జిల్లా కేంద్రంలో ఆదివారం ధ్రువీకరణ పత్రాలు అందించినట్లు రామకృష్ణ తెలిపారు.

ప్రజలకు అర్థమైన భాషలో ఆటవెలది పద్యాలు

రాజాం: రాయలసీమలో 17వ శతాబ్దంలో సంచరించి ఆట వెలది పద్యాలను రచించిన వేమన ప్రజాకవి అని రచయిత బొంతు సూర్యనారాయణ (ప్రవాహి) తెలిపారు. ఆదివారం రాజాంలో రాజాం రచయితల వేదిక 110వ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేమన ప్రగతిశీలత అన్న అంశంపై ప్రసంగించారు. వేమన ఆనాటి సంఘంలోని అనేక దోషాలను విమర్శిస్తూ ప్రజలకు అర్థమైన భాషలో చిన్న చిన్న ఆటవెలది పద్యాలను వేలాదిగా రచించాడని తెలిపారు. రాజాపు కాంతారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, పెంకి దయానిది నాయుడు, ఒమ్మి రమణమూర్తి, నేతేట గణేశ్వరరావు, పెంకి చైతన్యకుమార్, వల్లూరు రామినాయుడు, సమతం మహేశ్వరరావు, శాసపు సత్యానారాయణ పాల్గొన్నారు.

బేబీనాయన పరామర్శ

తెర్లాం: ఇటీవల నెమలాంలో మజీ సర్పంచ్ కోనారి వెంకన్న ఇటీవల మరణించారని తెలుసుకుని ఆ కుటుంబ సభ్యులను ఆదివారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదే గ్రామంలో నాయకులు కోనారి రామన్న కూడా మరణించిన విషయం తెలుసుకుని ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకట నాయుడు, నాయకులు రాష్ట్ర వాణిజ్య విభాగాల కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేష్, గ్రామ నాయకులు మాజీ సర్పంచ్ వెంకట నాయుడు, సత్యనారాయణ, ఆనంద్, రమేష్, అప్పల నాయుడు, కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో వివాదాలకు దూరంగా ఉండాలి

రేగిడి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఎటువంటి అల్లర్లుకు తావి వ్వకుండా వివిదాలకు దూరంగా ఉండాలని రేగిడి ఎస్ఐ శ్రీని వాస్ తెలిపారు. మండలంలో సంకిలిలో ఆదివారం రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు చైతన్యం సమావేశం నిర్వహించారు.

కూటమి అధికారంలోకి రావడం ఖాయం



పార్టీలో చేరిన వారితో బేబీనాయన

బొబ్బిలి, మార్చి 31: కూటమి పార్టీలు అధికారంలోకి రావడం ఖాయమని బొబ్బిలి తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కెకె రంగారావు(బేబీనాయన) అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని 14 వ వార్డులో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పూల్‌బాగ్‌లో మహిళలు, స్థానికులు బేబీనాయనకు ఘనస్వాగతం పలికారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, వార్డు ఇన్‌చార్జి ఏగిరెడ్డి శ్రీధర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు , పడాల సురేష్, గునుపూరు ప్రకాశ్, తెలుగుమహిళా నాయకురాళ్లు వెలగాడ హైమావతివాసు, బర్లి శ్రీదేవిబంగార్రాజు, బీసపు పార్వతి, కళ్యంపూడి లక్ష్మీసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. బేబీనాయన, తెంటును ప్రముఖవైద్యుడు డాక్టర్ గోపీనాథ్ సాదరస్వాగతం పలికారు. అభ్యుదయహైస్కూలు ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా శారద ప్రత్యేకబహుమతిని బేబీనాయనకు అందజేశారు. ఈ ప్రచారంలో బేబీనాయన మాట్లాడుతూ దుష్టపాలనకు చరమగీతం పాడడం ఖాయమని అన్నారు. ● బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని రామభద్రపురం మండలం మామిడివలస గ్రామానికి చెందిన 30 వైసీపీ కుటుంబాల వారు ఆదివారం బొబ్బిలి కోటకు వచ్చి బేబీనాయన సమక్షంలో టీడీపీలో చేరారు. సీనియర్ నేత, మాజీ వైస్ ఎంపీపీ, ప్రస్తుత గ్రామ ఎంపీటీసీ మడక తిరుపతినాయుడు నాయకత్వంలో మండల పార్టీ అధ్యక్షుడు కరణం విజయభాస్కరరావు ఆధ్వర్యంలో వారందరికీ బేబీనాయన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయండి

● టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి

విజయనగరం రూరల్, మార్చి 31: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని 28వ డివిజన్‌కు చెందిన మజ్జి మున్నా, ఇందిరా ధర్మ, కె.ఉమ, అప్పికొండ సుచరిత, మోర బాలాదిత్యతో పాటు, 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజపతిరాజు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, ఐదేళ్ల అరాచకం తప్ప, అభివృద్ధి లేదన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ పనిచేస్తుందన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, విజ్జపు ప్రసాద్, కనకల మురళీమోహన్, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారు బాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడుతో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అసంతృప్తి నేతలను వైసీపీ రెచ్చగొడుతోంది

● టీడీపీ ఉత్తరాంధ్ర పరిశీలకుడు శ్రీనివాసరెడ్డి

విజయనగరం రూరల్, మార్చి 31: త్వరలో జరగనున్న పార్లమెంటు, శాసనసభకు పోటీ చేసే అభ్యర్థులను వివిధ సమీకరణలు, సర్వేలు చేసి టీడీపీ ఎంపిక చేసిందని, టిక్కెట్ దక్కని వారు నిరాశలో ఉన్నారని, వారితో టీడీపీ అధిష్ఠానం చర్చలు జరుపుతోందని టీడీపీ ఉత్తరాంధ్ర పరిశీలకుడు శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఆదివారం విజయనగరం వచ్చిన ఆయన పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. టిక్కెట్ దక్కనివారు నిరాశలో ఉండడం సహజమని, పార్టీ నాయకత్వం వారితో చర్చలు జరుపుతోందన్నారు. వారికి భవిష్యత్తులో పార్టీ మంచే చేస్తుందన్నారు. ఓటమి అంచున ఉన్న వైసీపీ.. టిక్కెట్ రాని అభ్యర్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని, అసంతృప్తి నేతలను రెచ్చగొట్టే ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు. కొంత మందికి ఆర్థికంగా సాయం అందించి, ప్రలోభాలతో ఆందోళనలు చేయిస్తుందన్నారు. టిక్కెట్ ఆశించి, రాని ఆశావాహులతో టీడీపీ సంప్రదింపుల ప్రక్రియ కొనసాగిస్తుందన్నారు. నిరాశలో ఉన్న టీడీపీ నేతలు ఎవరూ వైసీపీ ట్రాప్‌లో చిక్కుకోవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడం, చంద్రబాబు నాయుడు సీఎం కావడం చారిత్రాత్మక అవసరమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీకి, పార్టీ అధినేత చంద్రబాబుకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

వైసీపీ పాలనలోనే ధరల భారం



చిన్న మార్కెట్‌లో మత్స్యకార మహిళలతో మాట్లాడుతూ, చేపలను పరిశీలిస్తున్న అదితి

విజయనగరం రూరల్, మార్చి 31: రానున్న ఎన్నికల్లో తనకి మద్దతు ఇవ్వాలని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజు అభ్యర్థించారు. ఆదివారం నగరంలోని చిన, పెద్ద మార్కెట్‌లలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. షాపుల యాజమానులతో మాట్లాడారు. నిత్యావసరాలు, కాయగూరల ధరలు ఈ ప్రభుత్వ హయాంలో విస్తృతంగా పెరిగాయన్నారు. ధరల నియంత్రణ చేపడతామని, ఊరూరా పాదయాత్ర సమయంలో చెప్పిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని వ్యాపారస్థులను ఆమె కోరారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, టీడీపీ మహిళా విభాగం నాయకులు చెన్నా రూపావాణి, మద్దాల నాగమ్మ, మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా ఆమె కాయగూరల వ్యాపారం చేస్తున్న మహిళలు, అదే విధంగా చేపలు విక్రయిస్తున్న మహిళలతో మాట్లాడి, వారి కష్టాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అదితి గజపతిరాజు ఆదివారం సాయంత్రం నగరంలోని 20వ డివిజన్‌లో పర్యటించారు. 20 వ డివిజన్‌లో పర్యటించిన ఆమెకి స్థానిక టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. జోగ చంటి, మాజీ కౌన్సిలర్లు కెల్ల పైడిరాజు, కెల్ల వరలక్ష్మి, సుంకరి శ్రీనుబాబు, కల్లూరి లక్ష్మణరావు, సూరిబాబు, టీడీపీ మహిళా విభాగం నాయకులు అవనాపు భార్గవి, మురిపెన పద్మలత, ఝాన్సీతో పాటు, నగర టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రాం

విజయనగరం రూరల్: రానున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కలిశెట్టి అప్పలనాయుడు, అదితి గజపతిరాజును గెలిపించాలని కోరుతూ నగరంలోని 8వ డివిజన్‌లో టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు 'బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రాం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బ్రాహ్మణులు ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల వైసీపీ హయాంలో బ్రాహ్మణులపై దాడులు, హిందూ దేవాలయాలపై జరిగిన సంఘటనలు వివరించారు. మే నెల 13న జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని, సైకిల్ గుర్తుపై ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ బ్రాహ్మణ విభా గం నాయకులు డాక్టర్ పేరి రాయమ్మ పంతులు, దవళ వెంకటరావు, సారిపాక రమణమూర్తి, వడ్లమాని శేఖర్, సంబర సన్యాసిరావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అందరూ కోరుకుంటే పోటీ చేస్తా



మాట్లాడుతున్న గొంప కృష్ణ

శృంగవరపుకోట, మార్చి 31: మీ అందరూ కోరుకుంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని శృంగవరపుకోట నియోజకవర్గ యువ నేత గొంప కృష్ణ పేర్కొ న్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఆకుల డిపో వద్ద బహిరంగ సభ నిర్వహించారు. గత రెండేళ్లగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేశానన్నారు. టీడీపీ టిక్కెట్ ఇవ్వకుండా అన్యాయం చేసిందన్నారు. నియోజక వర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానన్నారు. బహిరంగ సభ అనంతరం దేవీ బొమ్మ కూడలి వరకు ర్యాలీగా వెళ్లారు. దేవీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. విశాఖ పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, నాయకులు గొరపల్లి రాముడు, లగుడు రవికుమార్, పైడిబాబు, గొంప వెంకటరావు, గుమ్మడి భారతి, జుత్తాడ రామసత్యం తదితరులు ఉన్నారు.

వైసీపీని సాగనంపండి



కలిశెట్టిని సన్మానిస్తున్న కోండ్రు

రాజాం: రానున్న వైసీపీని ఇంటికి సాగనంపాలని రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ పిలుపు నిచ్చారు. ఆదివారం రాత్రి సంతకవిటి మండలంలోని మండా కురిటిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన పోవాలంటే అందరు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఓటర్లను మభ్యపెట్టడానికి, తాయిలాలు ఇవ్వడానికి వైసీపీ నాయుకులు సిద్ధంగా ఉన్నారని, అటువంటి తాయిలాలకు లొంగకుండా టీడీపీకి ఓటువేయాలని కోరారు. నాయకులు గట్టి భాను, వల్లూరు గణేష్, సమతం శ్రీనివాసరావు, పాపినాయుడు పాల్గొన్నారు. అనుభావం, బాధ్యత ఉన్న నేతగా మన కోసం చంద్రబా బునాయుడు చేసే పోరాటంలో ప్రజలంతా అండగా నిలవాలని కోండ్రు మురళీమోహన్ కోరారు. మండలంలోని సీఎస్‌ఆర్ పురం, ఆగూరు పంచాయతీ పరిధిలోని అమరాంలో ఎన్నిక ప్రచారం చేశారు. నాయకులు గురవాన నారాయణరావు, వంగా వెంకటరావు, వేగిరెడ్డి శంకరరావు, బొత్స మురళి, మాడుగుల జయరాం, పిల్లా సత్యంనాయుడు, టంకాల కన్నంనాయుడు, శాసపు రమేష్‌కుమార్ పాల్గొన్నారు. టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని నియోజకవర్గ పార్టీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. ఆదివారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో 200 మంది ఎస్సీ మహిళలు ఆయన్ను కలిశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

రాజాం: రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని విజయనగరం టీడీపీ ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఆదివారం శ్యాంపురంలోని క్యాంపు కార్యాలయంలో రాజాం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌ను అప్పలనాయుడు కలిశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అవ కాశాన్ని బట్టి తాను కూడా రాజాం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోను పర్యటిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కిమిడి అశోక్‌కుమార్, పరిశీలకులు కోరాడ చంద్రమోహన్, గురవాన నారాయణరావు, వంగా వెంకటరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, నంది సూర్యప్రకాష్‌రావు, సుమల వెంకట మన్మథరావు, టంకాల కన్నంనాయుడు, శాసపు రమేష్‌కుమార్, ముడ శ్రీనివాసరావు, పిల్లా సత్యంనాయుడు, మరిపి జగన్మోహన్‌రావు, టంకాల నాగరాజు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందిస్తున్న దృశ్యం

రాజాం: ఫోరం ఆఫ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ తరపున గతంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఇంగ్లీష్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో విజేతలకు ఆదివారం రాజాంలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో బహుమతులు ప్రదానం చేశారు. పొగిరి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జె.సురేష్, మామిడిపల్లికి చెందిన కె.నందిని, రాజాం బాలికోన్నత పాఠశాలకు చెందిన దీరాజ్‌లకు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహు మతులు, మండలస్థాయిలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, ఎస్.సత్య నారాయణ, బీవీ అచ్యుతకుమార్, దామోదరరావు పాల్గొన్నారు.

విజినిగిరిలో ఆంజనేయస్వామి తీర్థం



విజినిగిరి అంజనేయస్వామి

జామి, మార్చి 31 : మండలంలోని విజినిగిరి గ్రామంలో ఆదివారం ఆంజనేయస్వామి తీర్థం వైభవంగా నిర్వహించారు. వందలాదిగా ప్రజలు స్వామి వారిని దర్శించుకొని పూజలుచేశారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

జగన్ రాష్ట్రాన్ని లూటీ చేశారు



వేపాడ: ప్రచారంలో మాట్లాడుతున్న లలితకుమారి

వేపాడ, మార్చి 30: గత శాసనసభ ఎన్నికల్లో ఒక్క చాన్స్ పిలుపుతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని లూటీ చేశారని శృంగవరపుకోట ఉమ్మడి అభ్యర్థి కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం ఉదయం మండలంలోని ముకుందపురంలో, ఓబలయ్యపాలెం, పాలూరు గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒక్కచాన్స్ పేరుతో జగన్మోహనరెడ్డి ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని లూటీ చేయడమే కాకుండా రాష్ట్ర ప్రజలను పీకల లోతు అప్పుల ఊబిలోకి నెట్టేశారన్నారు. మండల మాజీ ఎంపీపీ, రాష్ట్ర ఎస్టీ కమిటీ ఉపాధ్యక్షురాలు దాసరి లక్ష్మి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, మండల పార్టీ ఉపాధ్య క్షుడు పోతల వెంకటరమణ, గోకాడ నాగభూషణం, పలుగ్రామాల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్ద జామి అప్పలనాయుడు, గ్రామ మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొని లలితమ్మకు హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. లలిత కుమారి ముందుగా ముకుందపురంలోని బంగారమ్మతల్లిని, ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు

లక్కవరపుకోట: మండలంలోని రెల్లి గౌరమ్మ పేటకు చెందిన సుమారు వంద కుటుంబాల నుంచి 300 మంది వైసీపీ నుంచి టీడీపీలోకి వలసవచ్చారు. ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి సమక్షంలో రాంప్రసాద్ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి సారధ్యంలో ఆదివారం వైసీపీకి చెందిన తుంపాల అప్పన్నదొర వర్గీయులంతా తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. లలితకుమారి విజయానికి తామంతా ముందుంటామని మహిళలు వాగ్దానం చేశారు. ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మహిళలు, టీడీపీ-జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ఘనంగా ఈస్టర్ పర్వదినం



రామభద్రపురంలో..



బొబ్బిలి: లూథరన్ చర్చిలో...

రామభద్రపురం, మార్చి 31: మండలంలో ఉన్న అన్ని చర్చిల్లో క్రైస్తవులు ఈస్టర్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముఖ్యంగా శతాబ్దాల చరిత్ర కలిగిన ఆరికతోట ఏడీఎంఎం బాప్టిస్టు చర్చిలో సంఘ కాపరి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో యేసయ్య ప్రార్థనలు, గీతాలు ఆలపిస్తూ బైబిల్‌లో పేర్కొన్న వివిధ ప్రబోధనలు, సువార్త చదివి వినిపించారు. ఈస్టర్ దినం అతిపవిత్ర దినమని, సమస్తమానవాళి రక్షణార్థం శిలువలో మరణించిన 3రోజుల తర్వాత తిరిగి ఈ పవిత్ర దినాన మృత్యువును జయించి తిరిగి లేచారని, ఆ సందర్భంగా ఏటా పునారుద్ధాన పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. సుమారు 40 రోజులు శ్రమదినాలుగా ప్రకటించుకుని ఉపవాస దీక్షలు చేస్తూ ఈ రోజున ఆ దీక్షలు విరమిస్తారని తెలిపారు. ముఖ్య అతిధి మాజీ సర్పంచ్ పెంకి భీమయ్య, ప్రెసిడెంట్ చంద్రశేఖర్, సెక్రటరీ జార్జ్ ఎబినైజర్, ట్రెజరర్ ఆదియ్య, గ్రామ సర్పంచ్ పెంకి పుష్పమ్మ, వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని సీబీఎం, ఆర్‌సీఎం, సెయింట్ ఆంధ్రూస్ లూథరన్ తదితర చర్చిలలో ఆదివారం క్రీస్తు పునరుద్ధాన పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చి పాస్టర్ పి.జాన్ విక్టర్ ,ఏయీఎల్‌సి డెలిగేట్ జేసీ రాజు ఆధ్వర్యంలో క్రైస్తవభక్తులు ప్రత్యేక భక్తిగీతాలతో ప్రార్థనలు జరుపుకున్నారు. అన్ని సంస్థలకు చెందిన చర్చిలలో వేలాది మంది క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

నాలుగో తరగతి ఉద్యోగుల నియామకానికి చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 96 మంది నాలుగో తరగతి ఉద్యోగులు నియా మకానికి వీలుగా గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈనెల 13న ప్రతిపాదనలే మిగు లుతున్నాయి..మూడుదశాబ్దాలుగా నియమకాలు లేవని అంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది.ఉన్నతాధికారులు స్పం దిస్తూ ప్రభుత్వ నిబంధనలకు అను గుణంగా ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల సీనియారిటీ జాబితాను సిద్ధం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారులు దీనికి సంబంధించి నివేదికను సిద్ధం చేస్తున్నా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నియామకాలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. అయితే ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవడంతో నాలుగో తరగతి ఉద్యోగుల్లో ఆశలు రేకెత్తుతు న్నాయి. కాగా నాలుగో తరగతి ఉద్యోగుల సీనియార్టీ జాబితా తయారు చేయడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి అన్నదొర అంధ్రజ్యోతికి తెలిపారు.

జ్వరాలపై చర్యలు తీసుకోండి

● జిల్లా మలేరియా అధికారి జగన్మోహన్‌రావు



దోమల నివారణపై వివరిస్తున్న జగన్మోహన్‌రావు

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో విషజ్వరాలు లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు కోరారు. జర్న గ్రామాన్ని శనివారం రాత్రి వైద్య బృందంతో సందర్శించారు. దోమల నివారణకు సిబ్బంది అక్కడ చేపట్టిన ఫాగింగ్ నిర్వహణను పరిశీలించారు. జ్వరాలు ఉంటేనే వారి పేర్లు నమోదు చేసు కొని చికిత్సలు అందించాలని తెలిపారు. దోమ తెరలు వినియోగంపై వివరించారు. రానున్న వేసవికాలంలో వడదెబ్బకు గురికాకుండా తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. అనంతరం దుడ్డుఖల్లు పీహెచ్‌సీని తనిఖీ చేసి ఓపీ, ల్యాబ్ రికార్డులు తనిఖీలు చేశారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కును అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సీతంపేట: అనారోగ్యంతో చనిపోయిన కానిస్టేబుల్ సవర ఆనప కుటుంబానికి ఆర్థికసాయం అందించినట్లు పోలీస్ ఉద్యోగుల యూనియన్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కృష్ణంనాయుడు ఆదివారం తెలిపారు. అసోసియేషన్ తరఫున డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి లక్ష రూపాయలు అందజేశారు. శ్రీకాకుళం జిల్లా హిరమండలం పోలీస్‌స్టేషన్‌లో ఆనప పనిచేసేవాడు. జిల్లాల విభజనలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ పోలీస్‌స్టేషన్‌లో అటాచ్‌మెంట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 20న తన గ్రామం సీతంపేట మండలంలోని కుడ్డపల్లిలో మృతిచెందడంతో ఎస్పీ ఆదేశాల మేరకు కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ సాయ, కార్యదర్శి కె.రాధా కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ వి.రాజారావు, కె. శ్రీనివాసరావు, రమణ పాల్గొన్నారు.

అడ్వెంచర్ పార్కులో 5డి థియేటర్

సీతంపేట: స్థానిక ఎన్‌టీఆర్ అడ్వెంచర్ పార్కులో ఏర్పాటు చేసిన 5డీ థియేటర్ అందుబాటులోకి వచ్చిందని ఐటీడీఏ అధికారులు ఆదివారం తెలిపారు. కొంతకాలంగా 5డీ థియేటర్ పాడవడంతో పర్యాటకులు నిరాశకు లోనయ్యేవారు. ఈ తరుణంలో పర్యాటకులకు మరింత వినోదం కల్పించాలని ఉద్దేశ్యంతో అందుబాటులోకి తీసుకొచ్చారు.

అచ్చెన్నకు పరామర్శ

పాలకొండ: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడును పాలకొండ టీడీపీ మండలాధ్యక్షుడు గండి రామినాయుడు నాయకులు హిమరిక ప్రసాద్, శాసపు సుగుణాకరరావు, కోట సంగంనాయుడు, ఎన్ని కిషోర్, కెల్ల దామోదర్ పరామర్శించారు.అచ్చెన్నాయుడు తల్లి కళావతమ్మ (90) ఆదివారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో మృతిచెందారు.

మెట్టుగూడ సమీపంలో వ్యాన్ బోల్తా



బోల్తాపడిన వ్యాన్‌ను ఎత్తుతున్న యువకులు

సీతంపేట: కొత్తూరు నుంచి సీతంపేట వైపు వస్తున్న పాల వ్యాన్ మెట్టుగూడ సమీపంలో ఆదివారం ఉదయం బోల్తాపడిన సంఘటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం తప్పించబోయి వ్యాన్ ఒక్కసారిగా బోల్తాపడింది. ఈసంఘటన చూసిన సమీప గ్రామాలకు చెందిన వెంటనే వచ్చి వ్యాన్‌ను నిలబెట్టారు.

నేడు జిల్లాకు ఎంపీ అభ్యర్థి గీత రాక

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం మన్యం జిల్లాకు అరకు పార్లమెంట్ ఎన్‌డీఏ అభ్యర్థిని కొత్తపల్లి గీత మొట్టమొదటిసారిగా సోమవారం రానున్నారు. ఎంపీ అభ్యర్థిత్వం ఖరారైన తర్వాత జిల్లాకు ఆమె వస్తుండడంతో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేస్తున్నారు. సీతానగరం మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం వరకు ర్యాలీగా జిల్లా బీజేపీ కార్యాలయానికి రానున్నారు.

ఉపాధి వేతనదారులకు తీపి కబురు

● వేతనం రూ.28 పెంపు ● నేటి నుంచి అమలు

కొమరాడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లే వేతనదారులకు రూ.28 పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు రూ.272 ఉన్న వేతనాన్ని రూ.300కు పెంచింది. ఈ నిర్ణయంతో పార్వతీపురం మన్యం జిల్లాలో 2.10 లక్షల వరకు జాబ్ కార్డులు ఉన్నాయి. వీరిలో 3.5 లక్షల మంది వేతనదారులకు ప్రయోజనం చేకూరనున్నది. పెరుగుతున్న జీవన విధానానికి అనుగుణంగా కూలీ రేటును ప్రభుత్వం పెంచితుంది. 2018-19లో రూ.125ఉండే కూలీని వరుసగా రూ.211, రూ.237, రూ.245, రూ.272, రూ.300 పెంచుతూ వచ్చింది. ఈ ఐదేళ్ల వ్యవధిలో 25.36 శాతం వేతనం పెరిగింది. ఉపాధి పనులకు వెళ్లేవారు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు మధ్యాహ్నం మూడు 3గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనులు చేయాలన్న నిబంధనను ప్రస్తుతం అమలు చేస్తున్నారు. పెంచిన వేతనాలు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్నట్టు కొమరాడ ఏపీవో బాలకృష్ణ తెలిపారు.

అవినీతిపాలనకు చరమగీతం పలకాలి

● బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం

రానున్న ఎన్నికల్లో అవినీతి పాలనకు చరమగీతం పలకాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. పలుచోట్ల వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు.



సాలూరు: పార్టీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న సంధ్యారాణి



పార్వతీపురంలో పర్యటిస్తున్న బొనెల విజయచంద్ర

సైనికుల్లా పనిచేయండి: విజయచంద్ర

పార్వతీపురంటౌన్: రానున్న ఎన్నికల్లో పోరాడి సీట్లు సాధించుకుందామని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి బొనెల విజయచంద్ర పిలుపునిచ్చారు. పార్వతీపురంలో నిర్వహించిన జనసేన పార్టీ ఆత్మీయ కలయిక కార్యక్రమంలో మాట్లాడారు. మనమంతా సైనికుల్లా పని చేస్తే విజయం తథ్యమన్నారు. వైసీపీ ప్రభుత్వం పాలనతో పాటు స్థానిక ఎమ్మెల్యే జోగారావు చేస్తున్న దందాలు, కబ్జాలు త్వరలోనే బయట పెడతామని చెప్పారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి.సీతారామ్, జి.వెంకటనాయుడు, ఎం.వెంకటేష్, ఎస్.వెంకటేష్, జనసేన నాయకులు సీహెచ్.అనిల్, గోవిందమ్మ, ఆర్.కురుణ, ముఖేష్, సురేష్, కాశీ పాల్గొన్నారు.

● **పార్వతీపురం:** రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీయే అధికారంలోకి వస్తుందని టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి బొనెల విజయచంద్ర అన్నారు.పార్వతీపురంలోని 4వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్య త్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో జగన్‌ను, పార్వతీపురం నియోజకవర్గంలో జోగారావును వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి.సీతారామ్, కె.వెంకటరావు, జి.వెంక టనాయుడు, ఎం.వెంకటేష్, ఎం.కృష్ణమోహన్, కె.నారాయణరావు, జనసేన నాయకులు పి.బాబు, సీహెచ్ అనిల్ పాల్గొన్నారు.

● **పార్వతీపురం రూరల్:** వెంకమ్మపేట గ్రామానికి చెందిన 50 మంది కూటమి అభ్యర్థి బొనెల విజయచంద్ర ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

మక్కువ: కూటమి విజయంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని సాలూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శంబరలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శంబరలో మద్ది రాజు, వసంతల తిరుపతి, గొట్టాపు కృష్ణ, వెలగాడ సింహాచలం, పోరాపు అశోక్ తదితర 150 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణు గోపాల్, సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావు, పి.మల్లేశ్వరరావు, గౌరీశంకర్, తిరుపతిరావు పాల్గొన్నారు.

టీడీపీలో 40 కుటుంబాల చేరిక

సాలూరు: మెంటాడ మండలం పెదచామలాపల్లి పంచాయతీకి చెందిన 40 కుటుంబాలు టీడీపీతీర్థం పుచ్చుకున్నాయి. సాలూరులో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ఇంట వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు చలుమూరి వెంకటరావు ఆధ్వర్యంలో వీరంతాపార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో బంగార్రాజు, దివకాల రాంబాబు ఉన్నారు. కార్యక్రమంలో నిమ్మాది చిట్టి, గెద్ద అన్నవరం, ముసలినాయుడు, గౌరీశ్వరరావు, డబ్బి కృష్ణ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు సరికాదు

వలంటీర్లను ఎన్నికల కోడ్ నేపథ్యంలో పింఛన్ పంచవద్దని చెప్పింది ఎన్నికల కమిషన్, అయితే దానికి కూటమికి ఏం సంబంధమని సంధ్యారాణి అన్నారు. వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేయటం సరికాదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వలంటీర్లపై తమ నేత మంచి అభిప్రాయంతోనే ఉన్నారని ఆమె స్పష్టం చేశారు.



సాలూరు: కొవ్వొత్తులతో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



భామినిలో..

ఘనంగా ఈస్టర్

సాలూరు: పట్టణంలోని మేరీనగర్‌తో పాటు పలు చర్చిల్లో ఈస్టర్ పండుగ వేడుకలు శనివారంరాత్రి 10 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. మేరీనగర్ విచారణలో కొవ్వొత్తులు వెలిగించి ఏసును రాక కోసం క్రైస్తవ మత విశ్వాసకులు ప్రార్థనలు, గీతాలాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనేక మంది మత విశ్వాసకులు, గురువులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

● **సాలూరు రూరల్:** ఏసుక్రీస్తు పునరుత్థానం పొందిన రోజు కావడంతో ఆదివారం సాలూరు మండలంలో వివిధ చర్చిలు, ప్రార్థన మందిరాల్లో ఈస్టర్ వేడుకలను ఆనందోత్సహాల మధ్య భక్తులు జరుపుకున్నారు. మామిడిపల్లి, పుణికిలవలస, దండిగాం, సారిక, దొరలతాడివలస, సన్యాసిరాజుపేట, బాగువలస తదితర గ్రామాల్లో ఈ వేడుకలను నిర్వహించారు. సాలూరు పెనయేలు మందిరంలో బవిరెడ్డి సన్యాసిరావు సువార్త చెప్పారు. కార్యక్రమంలో శ్యాముల్, ప్రసాద్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

● **భామిని:** బత్తిలి, లివిరి, నేరడి తదితర గ్రామాల్లో ఏసు ప్రభువు పునర్జనమ్మ ప్రార్థనలు క్రైస్తవులు నిర్వహించారు. నేరడిలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు.

● **పార్వతీపురంటౌన్:** ఏసు పునరుత్థానం సర్వమానవాళి రక్షణ కోసమేనని జిల్లా కేంద్రంలోని పండావీధి తిరుకుటుంబ దేవాలయ రెవరెండ్ ఫాదర్ వినోద్ కుమారం అన్నారు. ఆదివారం ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన చర్చిలో ప్రసంగించారు. ఏసు మరణాన్ని గెలిచి ప్రజలను కాపాడేందుకు వచ్చారన్నారు.

తవ్వేశారు.. వదిలేశారు



తవ్వి వదిలేసిన పైప్‌లైన్ గుంత

పార్వతీపురంటౌన్: సంపూర్ణ తాగునీటి సరఫరాలో భాగంగా పట్టణంలోని 24వ, 25వ వార్డులకు సంబంధించి తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు బొగ్గుల వీధిలో 20 రోజుల కిందట పెద్ద గుంతను తవ్వి వదిలేశారు. అయితే తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసినప్పటికీ గుంతను కప్పడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో వృద్ధులు, పిల్లలు ఆ గుంతలో పడి క్షతగాత్రులు అవుతున్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే జోగారావు ఆ వార్డుల్లో ప్రచారం చేశారు. ఈసందర్భంగా స్థానికులు ఆ పైప్‌లైన్ గుంతను పూడ్చాలని ఆయనను వేడుకున్నారు. అంతే కాకుండా గుంతను పూడ్చకపోతే మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపడతామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు.

ఒడిశా తీరుపై సుప్రీంలో కేసు వేయాలి

సాలూరు /రూరల్: కొఠియా విషయంలో ఒడిశా తీరుపై కలెక్టర్, పార్వతీపురం ఐటీడీఏ పీవోలు సుప్రీం కోర్టులో కేసు వేయాలని ఉపముఖ్యమంత్రి రాజన్నదొర కోరారు. ఈ మేరకు అయన ఆదివారం సాలూరులో విలేకర్లతో మాట్లాడారు. ఏవోబీలో కొఠియా గిరిజనులు నివాసం ఉండే చోట సుప్రీంకోర్టు స్టేటస్‌కో అమల్లో ఉండగా ఒడిశా గనులు తవ్వకానికి సన్నాహాలు చేస్తుందని గిరిజనులు అడ్డుకొని ఆందోళన చేశారన్నారు. కొఠియా గిరిజనుల స్వేచ్ఛయుత జీవనానికి భంగం కలిగించే విధంగా వ్యవహరించిన ఒడిశాపై కేసు వేయాలన్నారు. ఏపీ పరిషత్ ఎన్నికల సందర్భంగా 2022 ఏప్రిల్‌లో కొఠియా గిరిజనులు ఓటు వేయకుండా ఒడిశా పోలీసులు బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారని చెప్పారు. ఇది ప్రజాస్వామ్యానికి విఘాతమన్నారు. కొఠియా గ్రూప్ గిరిజనులకు, ఏపీ అధికారులకు ఒడిశా వల్ల ఎదురువుతున్న ఇబ్బందులను ఏపీ ప్రభుత్వ కార్యదర్శి దృష్టికి కలెక్టర్, ఎస్పీ తీసుకెళ్లాలని కోరారు.

ర్యాలీ జయప్రదం చేయండి

సీతానగరం: పార్వతీపురం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి విజయ్‌చంద్ర ఆధ్వర్యంలో సోమవారం లచ్చయ్యపేట గ్రామం నుంచి ర్యాలీ నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిగా అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొత్తపల్లి గీత ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. లచ్చయ్యపేట నుంచి పార్వతీపురం వరకు బైకు ర్యాలీలో నియోజకవర్గ ఉమ్మడి పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆటస్థలం అభివృద్ధికి నిధులు

వీరఘట్టం: పట్టణంలోని ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన ఆటస్థలం అభివృద్ధికి పీఎంశ్రీ నిధులు మంజూరయ్యాయని హెచ్ఎం బి.సోమ్‌బర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో పాఠశాల ఆవరణలోని క్రీడా ప్రాంగణాన్ని చదును చేయనున్నట్లు పేర్కొన్నారు. వాలీబాల్, లాంగ్‌జంప్ కోర్టు తయారు చేస్తున్నట్టు తెలిపారు.

న్యాయ చేస్తారనే నమ్ముతున్నా..

● టీడీపీ నాయకుడు నాగార్జున



మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నుంచి తనకు రమ్మని వర్తమానం అందిందని, చీపురుపల్లి అసెంబ్లీ స్థానం విషయంలో పునః పరిశీలన చేస్తారని విశ్వసిస్తున్నానని పార్టీ నాయకుడు కిమిడి నాగార్జున అన్నారు. ఆదివారం చీపురుపల్లిలోని తన నివాసంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమా వేశం నిర్వహించి, ఆయన మాట్లాడారు. బొత్సకు దీటుగా తాను ఏవిధంగా పని చేశానో లోకేశ్‌కు వివరిస్తానని చెప్పారు. చీపురుపల్లి టికెట్ కేటాయింపుపై పున రాలోచన చేయాల్సిందిగా ఆయనను కోరతానని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు రౌతు కాము నాయుడు, దన్నాన రామచంద్రుడు, మహంతి అప్పల నాయుడు, ఆరతి సాహూ, శనపతి శ్రీనివాసరావు, తాడి సన్యాసినాయుడు, పైల బలరాం పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలులో నెల్లిమర్ల ప్రథమం

నెల్లిమర్ల: ఆస్తి పన్ను వసూలులో నెల్లిమర్ల నగర పంచాయతీ రాష్ట్రంలోనే ప్రథమ స్థానాన్ని సాధించింది. ఈ నగర పంచాయతీకి సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.కోటి 28లక్షలు వసూలు చేయాల్సి ఉండగా, ఆర్థిక సంవత్సరం చివరి రోజు మార్చి 31వ తేదీ ఆదివారం నాటికి రూ.కోటి 26లక్షలు వసూలు చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్టు కమిషనర్ పి.బాలాజీప్రసాద్ తెలిపారు. ఆస్తి పన్ను వసూలు లక్ష్యంలో 98.50 శాతం వసూలు సాధించినట్టు ఆయన వివరించారు. ఈ వసూళ్లలో కీలక పాత్ర పోషించిన కార్యాలయ మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, ఆర్ఐ ఎ.రాజ్యలక్ష్మి, కార్యాలయ సిబ్బంది, సచివాలయాల సిబ్బందిని కమిషనర్ ఈ సందర్భంగా అభినందించారు.

అధ్వానంగా మహారాజపేట



రహదారిపై నిలిచిన మురుగునీరు

భోగాపురం: రాజాపులోవ పంచాయతీ మహారాజపేట గ్రామం ఎక్కడ చూసినా అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. గ్రామంలో ఎక్కడబడితే అక్కడ చెత్త పేరుకుపోయింది. వాడుక నీరు ఎక్కడికక్కడే నిల్వ ఉండిపోవడంతో స్థానికులు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. దోమలు స్వైర విహారం చేస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పారిశుధ్య పరిస్థితులను మెరుగు పరచాలని స్థానికులు కోరుతున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

చీపురుపల్లి: గొంతు క్యాన్సర్‌తో ఇటీవల మృతిచెందిన ఆకులపేటకు చెందిన పతివాడ గొల్ల కుటుంబానికి సహృదయ ఫౌండేషన్ అధ్యక్షురాలు తాడివాక బిందు రూ.15వేలు సాయం చేశారు. ఆశయ ట్రస్టు అధ్యక్షుడు రెడ్డి రమణ ద్వారా ఈ మొత్తాన్ని అందజేశారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొండపల్లి శ్రీనివాస్

దత్తిరాజేరు: టీడీపీ హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందని గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రాజులరామచంద్రపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన క్లస్టర్ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ పప్పల తవుడు, పప్పల ఈశ్వరరావు, డోకుల తిరుపతితోపాటు పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి శ్రీనివాస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ పెద్దింటి మోహన్, ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు బి.బంగారునాయుడు, ఎం.మహేష్, పి.జగన్, పార్టీ సీనియర్ నాయకులు చెల్లూరు సత్యారావు పాల్గొన్నారు.

సచివాలయంలోనే పింఛన్లు



వలంటీర్ల నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుంటున్న పురిటిపెంట ఈవో జనార్దన్

గజపతినగరం: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పింఛన్‌దారులకు ఏప్రిల్ 1న గ్రామ సచివాలయాల్లోనే పింఛన్లు అందజేస్తారని ఎంపీడీవో జయింతి ప్రసాద్ ఆదివారం స్థానిక విలేకర్లకు తెలిపారు. మండలంలోని 296 మంది వలంటీర్ల నుంచి సెల్‌ఫోన్ సిమ్‌లు, బయోమెట్రిక్ వెనక్కు తీసుకున్నామని చెప్పారు. ఎన్నికలు ముగిసిన మూడు నెలల వరకు గ్రామ సచివాలయంలోనే అధికారులతో పింఛన్లు అందజేస్తామని తెలిపారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాల్లో ఈనెల 3 నుంచి పింఛన్లు అందజేస్తామన్నారు.

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

గంట్యాడ: రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఎస్ఐ సురేంద్ర నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం కొటారు బిల్లి కూడలిలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆటో డ్రైవర్లకు రహదారి ప్రమాదాల నివారణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ట్రాఫిక్‌రూల్స్‌ను వివరించారు. ఆటోనడిపిన సమయంలో ముందు సీటులో ఎవరినీ కూర్చు పెట్టరాదని, వేగంతో వెళ్లరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టులు లేకపోతే సాగు నీరొచ్చేదెలా?

● గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై కొర్లాం రైతుల ఆందోళన



కల్వర్టులు నిర్మించాలని కోరుతున్న రైతులు

గంట్యాడ: పంట పొలాలకు సాగునీరు వచ్చే కాలువలు ఉన్న చోట పెద్ద పెద్ద కల్వర్టులు నిర్మించకపోతే పైనుంచి నీరు ఎలా వస్తుంది.. దీనిపై ఇప్పటికి నాలుగు సార్లు కలెక్టర్ గ్రీవెన్స్‌కు విన్నవించాం.. అయినా ఎవరూ పట్టించుకోలేదంటూ కొర్లాం గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం విశాఖపట్టణం నుంచి రాయపూర్ వరకూ జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్నారు. మండలంలోని కొర్లాం గ్రామం వద్ద రింగ్‌రోడ్డు నిర్మిస్తున్నారు. కొర్లాం గ్రామానికి చెందిన సుమారు 650 ఎకరాలకు డొంకలగెడ్డ ద్వారా సాగు వస్తుంది. గతంలో ఉన్న కాలువలు మూసివేసి వాటి స్థానంలో మూడు అడుగుల వెడల్పు ఉన్న కల్వర్టులు నిర్మించారు. వీటి వల్ల ఎటువంటి ఉపయోగం లేదని గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా నిర్మించడం వల్ల గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రెండు చోట్ల గండి కొట్టివేసిందని తెలిపారు. డొంకలగెడ్డ నుంచి జగన్నాథ సాగరం చెరువు వరకూ నాలుగు చోట్ల పెద్ద పెద్ద కల్వర్టులు నిర్మించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యను ఇరిగేషన్ అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లామని చెప్పారు. పలుమార్లు సంబంధిత శాఖాధికారులు పరిశీలించారు. కొన్ని సమయాల్లో ఆయకట్టు రైతులు రహదారి నిర్మించిన చోట నిరసన వ్యక్తం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. తమ గ్రామానికి చెందిన పొలాలను రోడ్డుకు ఇచ్చామని, ఉన్న పొలాల్లో కూడా పంటలు పండించుకోవాలంటే సాగునీరు రావడానికి ఇబ్బంది వస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఆదివారం కూడా రహదారి పనులు జరిగే వద్ద ఆందోళన చేపట్టారు. రహదారి అధికారులు, జిల్లా అధికారులు స్పందించి తమ పొలాలకు సాగునీరు రావాలంటే నాలుగు చోట్ల పెద్ద పెద్ద కల్వర్టులు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దీనిపై పోరాటం చేస్తామని ఆయకట్టు రైతు పి.వెంకటరావు చెప్పారు.